# పొదుపు

ఎంత లెమ్మని మనం పట్టించుకోని విషయా లలో ఎంత డబ్బు దుబారా అవుతుంటుందో సవివరంగా అనర్గళంగా ఉపన్యసిస్తున్నాడు లెక్చరర్ సుబ్బారావు రోటరీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో. శ్రద్ధగా విన్నారు శ్రోతలు. కొందరు చప్పట్ల ద్వారా తమ హర్షాన్ని తెలియజేశారు. చివ రగా సుబ్బారావు తన సహజ ధోరణిలో

'కాదేదీ పొదుపు కనర్హం
అగ్గిపుల్లా, సబ్బు బిళ్లా
కాలే కరెంటూ, గ్యాసూ
కడుపునిండిన తిండీ
రాసే పేపరూ,
రాయించే యింకూ
సేవింగ్ వస్తువులేనోయ్
అన్నీ,
ప్రత్యూషం సిగరెట్టూ
ప్రతి వారం సినిమా
కట్ చేసుకు
బ్రతకాలోయ్
కాషస్‌గా
మెలగాలోయ్
కరెన్సీ వెనకేయాలోయ్!

— అని ముగించాడు. మరో మారు హాలంతా కర తాళ ధ్వనులతో మార్మోగిపోయింది.

రాత్రి తొమ్మిదైంది. సిగరెట్ వెలిగించి, సైకి లెక్కి ఇంటి ముఖం పట్టాడు సుబ్బారావు. దారిలో అన్నమాచార్య కళా మందిరంలో సంగీత సభకు వెళ్లిన భార్యామణిని తోడ్కొని ఇంటికి చేరి తలుపులు తీశాడు. మధ్యాహ్నం మూడు గంటలకు తను బయల్దేరినప్పుడు స్విచ్ ఆఫ్ చేయడం మర్చి పోగా గిర్రున తిరుగుతున్న ఫ్యానూ, ప్రేక్షకులు లేకుండా స్వేచ్ఛగా సీన్లు మారుతున్న టీ.వి. వెక్కి రిస్తోంటే రోటరీ హాలు "కరతాళ ధ్వనులు" గుర్తు కొచ్చి క్రీగంట భార్యను చూస్తూవుండిపోయాడు సుబ్బారావు.

—జిప్సీ

# ప్రేమ మంత్రం

బి.యస్సీ రెండోసంవత్సరంలో కొత్తగా చేరిన రాధ అరవిరసిన గులాబీలా వుంటుంది. వరుగ్గా మెరిసే కళ్ళు, వలాకీగా ఎదుటి వారితో మాట్లాడే తీరు ఆమెకో ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. సన్నగా, తెల్లగా వుండే రాధ క్లాసులోనే కాదు కాలేజీలో కూడా అందర్నీ ఆకర్షిం చింది. రాధ మనసును ఆకట్టుకోవాలని రజనీష్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు.



రజనీష్ ఫైనలియర్ స్టూడెంట్! రోజుకో రంగు కారులో వస్తూ, మిత్రులతో పెళ్ళి బృందంలా వూరేగుతూ, కనిపించిన అమ్మాయిల్ని అల్లరిపెడు తుంటాడు. వారు భయపడితే విలాసంగా నవ్వుతూ, నిక్‌నేమ్స్‌తో గోల చేస్తాడు. ఏ అమ్మాయైనా కోప్పడితే అనవసరంగా గొడవపడి 'సారీ' చెప్పించుకునేదాక వదలడు.

కానీ రాధ తన ఆస్తి, అల్లరి చూసి కూడా నిర్లక్ష్యంగా మాట్లాడేసరికి క్రుంగిపోయాడు. 'ఇలా వెంటబడి అల్లరి చేస్తే ప్రిన్సిపాల్‌కే కాక పోలీసులకు కూడా చెప్పాల్సి వస్తుందని' రాధ హెచ్చరించడంతో రజనీష్‌లో ఉక్రోషం ముంచుకొచ్చింది. అందమైన రాధనెలా దారిలోకి తెచ్చు కోవాలో అర్థంకావడం లేదు. ఈ స్థితిలో వూరిలో పేరు మోసిన 'బాబా'ను కలవమని సలహా యిచ్చారు స్నేహితులు.

బాబా మంత్రాలు బాగా పనిచేస్తాయని ప్రజల నమ్మకం. బాబా మంత్ర ఫలం వలన అనుకున్న కార్యాలు పూర్తవుతాయని విశ్వాసం ప్రబలింది. అంతే కాదు పాము కాటుకు, దయ్యాలు వదల్చడానికి కూడా మంత్రాలు వేస్తాడు. రజనీష్ ప్రేమ కథ విన్నాక బాబాకు జాలేసింది.

"అలాగే బాబూ! నీవొక ప్రేమ లేఖ రాసివ్వు. నేను మంత్రించి ఇస్తాను. దాన్ని ఎవరూ చూడనివేళ ఆమె పుస్తకంలో పెట్టేయ్. ఆ లేఖ చదివాక ఆమె తప్పక నీ వశం అవు తుంది. నీ వెంటపడి ప్రేమా! ప్రేమా!! అని పలవరిస్తుంది" చెప్పాడు బాబా.

రజనీష్ ఆనందంతో పొంగి పోయాడు. మొహం కాంటెస్సా కారులా వెలిగిపోయింది. బాబా మంత్రించి యిచ్చిన ప్రేమ లేఖ తీసుకుని కాలేజీకి వెళ్లాడు.

మధ్యాహ్నం టీ బ్రేకులో క్యాంటీన్ కెళ్లిన సమయంలో రాధ 'కెమిస్ట్రీ' నోట్సులో ఆ లేఖ వుంచాడు. ఎవరూ చూడనందుకు తృప్తి పడ్డాడు. ఈ లేఖ చదివిన రాధ తన స్వంతం కాగలదన్న వూహ తీయగా వుంది. మంచి సలహా ఇచ్చిన మిత్రులందర్నీ బార్‌కు తీసికెళ్లాడు రజనీష్.

మరుసటి రోజు ఉదయం క్లాసుకు వస్తున్న రాధను వెంబడించాడు రజనీష్. 'ఇడియట్...' కోపంగా తిట్టింది రాధ. ఆశ్చర్యపోయాడు రజనీష్. "రాధా! రాత్రి 'కెమిస్ట్రీ' నోట్సు చదవలేదా" అడిగాడు. అర్థం కాక చూసింది రాధ. మళ్ళీ అడిగాడు.

" ఆ పుస్తకం తను చదవాలని మా క్లాస్‌మేట్ 'పర్వతం' తీసికెళ్ళింది. అదిగో ఇటే వస్తోంది. అయినా ఎందుకడిగావు..." రాధ మాట పూర్తికాక మునుపే రజనీష్ కాలుని ఎక్స్‌లేటర్‌పై బలంగా వేశాడు. రివ్వున దూసుకెళ్ళిన కారువంక కోపంగా చూస్తుండి పోయింది రాధ.

—జి.నాగరాజు